AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
29-12-2025 (monday)
MAIN EDITION

## రూ. 1.50 లక్షలకు చేరువలో బంగారం ధర..




**అక్షరటుడే, హైదరాబాద్:** వారం రోజులుగా బంగారం, వెండి ధరల్లో భారీ ర్యాలీ కొనసాగుతూ ఆల్‌టైమ్ రికార్డులు నమోదయ్యాయి. ఈ వారం కూడా అదే జోరు కొనసాగి పసిడి ధర రూ.1.50 లక్షల మార్కును దాటే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మంగళవారం జరగనున్న అమెరికా ఫెడ్ రేట్ సమావేశం ఫలితాలపై ఆధారపడి బంగారం, వెండి ధరల దిశ నిర్ణయమవుతుందని చెబుతున్నారు. సోమవారం దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,200గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,29,000గా ఉండగా, కిలో వెండి ధర రూ.2,50,900 వద్ద నమోదైంది.

## ఉన్నావ్ అత్యాచారం కేసులో సుప్రీం కీలక తీర్పు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉన్నావ్ అత్యాచారం కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు షాక్ ఇచ్చింది. జీవిత ఖైదును నిలిపివేస్తూ బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. నిందితుడు వేరే నేరంలో దోషిగా తేలిన ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వు అమలుపై స్టే విధిస్తున్నట్లు సీజేఐ సూర్య కాంత్ అన్నారు. జీవిత ఖైదును నిలిపివేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బహిష్కృత బీజేపీ నాయకుడికి నోటీసు కూడా జారీ చేసింది.

## ఆరావళి మైనింగ్‌పై సుప్రీం కీలక ఆదేశాలు



**అక్షరటుడే, ఢిల్లీ:** ఆరావళి పర్వతాల్లో గనుల తవ్వకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 100 మీటర్లలోపు ఉన్న పర్వతాల వద్ద మైనింగ్‌కు సుప్రీం అనుమతించిన విషయం తెలిసిందే. తదుపరి ఉత్తర్వుల వరకూ గత ఆదేశాలను నిలిపివేస్తూ సీజేఐ ధర్మాసనం తాజాగా నిర్ణయం తీసుకుంది.

## అల్లు శిరీష్ వివాహ తేదీ ఖరారు..



**అక్షరటుడే, సినిమా డెస్క్:** నటుడు అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారు. తన ప్రియురాలు నయనికతో అక్టోబర్‌లో నిశ్చితార్థం జరిగింది. తాజాగా శిరీష్ తన పెళ్లి తేదీని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఇన్‌స్టాలో ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అయాన్, అర్హలతో రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు.

## రేపు తిరుమలకు సీఎం రేవంత్



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం తిరుమలకు వెళ్లనున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకునేందుకు కుటుంబంతో సహా వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నారు. కాగా.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది.



**అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం అయ్యాయి. సోమవారం ఉదయం 10:30 గంటలకు సభ ప్రారంభమైంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు అయ్యారు. బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత చాలా రోజుల తర్వాత సభకు హాజరు అయ్యారు. తొలిరోజు సంతాప తీర్మానాల అనంతరం జీరో అవర్ నిర్వహించారు. అనంతరం ఉభయ సభలను జనవరి 2కు వాయిదా పడ్డాయి.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# సభా సమయం!

**■ ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ■ మూడు నిమిషాలే ఉన్న కేసీఆర్**
**■ జీరో అవర్‌లో మాట్లాడిన ఎమ్మెల్యేలు ■ కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలతో దుమారం**

సమావేశాల్లో ముందుగా సంతాప తీర్మానాలను ప్రవేశ పెట్టారు. ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం జీరో అవర్‌లో భాగంగా పలువురు సభ్యులు మాట్లాడారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ అందించడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు పుడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. హరీశ్‌రావు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

### కేసీఆర్‌ను కలిసిన రేవంత్

సభలో అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుగా వచ్చారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన నేరుగా కేసీఆర్ వద్దకు వెళ్లి కరచాలనం చేశారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు సైతం కేసీఆర్‌ను కలిశారు. ఇటీవల జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలిచిన నవీన్ యాదవ్ సైతం ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

### సంతకం చేసి వెళ్లిన కేసీఆర్

అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్ పాల్గొంటారని గత నాలుగు రోజులుగా తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఆయన సభలో మూడు నిమిషాలు మాత్రమే ఉన్నారు. జాతీయ గీతం అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోయారు. సంతాప తీర్మానాల్లో కూడా పాల్గొనలేదు. దీంతో రానున్న రోజుల్లో ఆయన సమావేశాల్లో పాల్గొంటారా లేదా అనేది తెలియాల్సి ఉంది.


### బాంబులు పెట్టి పేల్చేశారు

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జీరో అవర్‌లో మాట్లాడారు. మేడిగడ్డను బాంబులు పెట్టి పేల్చేశారని, అదే విధంగా ఇటీవల పలు చెక్ డ్యామ్‌లను సైతం పేల్చారన్నారు. తనుగుల చెక్ డ్యాంను బాంబు పెట్టి పేల్చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో సభలో దుమారం రేగింది. కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని అనడం ఏంటని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు.

### భాష మార్చుకోవాలి

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. సభలో, బయట నేతలు మాట్లాడుతున్న భాషపై అభ్యంతరం తెలిపారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు గౌరవ మర్యాదలతో మాట్లాడాలన్నారు. ఫ్యూచర్‌లో సభకు వచ్చే సభ్యులకు మనం ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. చాలా మంది సీఎం, మాజీ సీఎం, ప్రధాని పట్ల అగౌరవంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్ననాటి మిత్రులతో మాట్లాడినట్లు వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. సభలో అర్థమవంతమైన విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకోవాలని సూచించారు. దీనికి మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఇలాంటి భాష ఎవరు మాట్లాడిన తప్పు అన్నారు. జీరో అవర్ అనంతరం స్పీకర్ సభను జనవరి 2వ తేదీకి వాయిదా వేశారు.

## నేను జైలులో ఉన్నా పార్టీ చూసుకుంటుంది




**అక్షరటుడే, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం ఉదయం ఆయన మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. కొన్ని రోజులుగా కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఫార్ములా ఈ కారు రేస్ కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయనను అదుపులోకి తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. దీనిపై తాజాగా కేటీఆర్ స్పందిస్తూ.. మున్సిపల్ ఎన్నికలకు తనను లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. తాను లోపల ఉన్నా.. పార్టీ చూసుకుంటుందని చెప్పారు. బెదిరింపులకు తాను భయపడనని వ్యాఖ్యానించారు. పార్టీ వదిలి వెళ్లిన నేతలను మళ్లీ తీసుకోవాల్సిన అవసరం లేదని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీని కాదని బీజేపీలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో అత్యధిక సర్పంచ్ స్థానాలు గెలిచి సత్తా చాటామన్నారు. నేతల బలం లేకున్నా బీఆర్ఎస్ కార్యకర్తలు సర్పంచులను గెలిపించుకున్నారని చెప్పారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయన్నారు.

## ఏపీలో కొత్త జిల్లాల ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లె కొత్త జిల్లాకు, రాజంపేటను కడపకు, రైల్వేకోడూరును తిరుపతికి మార్చే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. గూడూరును తిరుపతి జిల్లా నుంచి నెల్లూరులో కలిపేందుకు నిర్ణయించింది. అలాగే కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 28కి పెరగనుంది.

## ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం..

**అక్షరటుడే, విశాఖ:** విశాఖపట్నం జిల్లా దువ్వాడ మార్గంలో ప్రయాణిస్తున్న ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రైల్లోని ప్యాంట్రీ కారుకు సమీపంలో ఉన్న B1, M2 ఏసీ బోగీల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఎలమంచిలి సమీపంలోని ఓ పా యింట్ వద్ద లోకో పైలట్లు పొగను గమనించి అప్రమత్తమై రైలును స్టేషన్‌లో నిలిపివేశారు. మంటలు వేగంగా వ్యాపించి రెండు బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో ప్రయాణికులు బోగీల నుంచి బయటకు పరుగులు తీశారు. కాగా.. ఈ ఘటనలో B1 బోగీలో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్ (70) సజీవ దహనమయ్యాడు.



## రెండు హెలికాప్టర్లు ఢీ.. ఒకరు మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** రెండు హెలికాప్టర్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన అమెరికాలోని న్యూజెర్సీ హామోంటన్‌లో చోటు చేసుకుంది. హామోంటన్‌లోని 100 బేసిన్ రోడ్ వద్ద రెండు హెలికాప్టర్లు కూలిపోయాయి. ఒక విమానం పూర్తిగా మంటల్లో మునిగిపోయిందని, రెండో హెలికాప్టర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో కూలిపోయిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. హామోంటన్ మున్సిపల్ విమానాశ్రయం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు



**అక్షరటుడే, హైదరాబాద్:** జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇటీవల డిప్యూటీ కమిషనర్ల బదిలీ చేపట్టారు. ఇందులో భాగంగా అల్వాల్ సర్కిల్‌లో పని చేస్తున్న శ్రీనివాస్ రెడ్డిని కవాడిగూడకు బదిలీ చేశారు. అయితే ఆయన అక్కడకు వెళ్లడానికి ఇష్టపడలేదు. బదిలీ చేసిన ప్రాంతంలో విధుల్లో చేరకుండా ఓ మంత్రి, స్థానిక నాయకుడితో కమిషనర్‌కు ఫోన్ చేసినట్లు సమాచారం. అల్వాల్‌లోనే కొనసాగించాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ ఆర్వీ కర్ణన్ సదరు డిప్యూటీ కమిషనర్‌ను సస్పెండ్ చేశారు.

## భారీగా పెరిగిన దక్షిణ మధ్య రైల్వే ఆదాయం




**అక్షరటుడే, హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే ఆదాయం ఈ ఏడాది భారీగా పెరిగింది. వివరాలను అధికారులు వెల్లడించారు. దేశంలో రైల్వే శాఖ నిత్యం కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోంది. ప్రయాణికుల రద్దీ మేరకు రైళ్లను నడుపుతోంది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నూతన హంగులతో వందే భారత్ రైళ్లను సైతం ప్రవేశ పెట్టింది. దీంతో రైళ్లలో రద్దీ రోజు రోజుకు పెరుగుతోంది. దక్షిణ మధ్య రైల్వే అధికారులు కూడా డిమాండ్‌కు తగ్గట్లు సర్వీసులు నడుపుతున్నారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు రికార్డు స్థాయిలో రూ.19,314 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది రూ.18,831 కోట్లు కాగా.. ఈ సారి రూ.483 కోట్లు ఎక్కువ రావడం గమనార్హం.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ యువతుల మృతి



**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తెలంగాణకు చెందిన ఇద్దరు యువతులు చనిపోయారు. కాలిఫోర్నియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా గార్ల గ్రామం మీసేవ కేంద్రం నిర్వాహకుడు నాగేశ్వరరావు కూతురు మేఘన, ముల్కనూర్ ఉప సర్పంచ్ కోటేశ్వరరావు కూతురు భావన మృతి చెందారు. ఉన్నత చదువుల కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

## వెజిటేరియన్‌గా మారిన క్యాట్ భామ..



**గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఇటీవల తన జీవనశైలిలో కీలక మార్పు చేసుకుంది. గతంలో మాంసాహారం ఇష్టపడే ఈ బ్యూటీ ఇప్పుడు పూర్తిగా శాకాహారిగా మారిపోయి, కేవలం మొక్కల ఆధారిత ఆహారాన్ని మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిపింది. ఈ మార్పు వల్ల ఆమె శరీరంలో కొన్ని ఆశ్చర్యకరమైన మార్పులు చోటు చేసుకున్నాయని ఇటీవల చేసిన ఇంటర్వ్యూలో జాక్వెలిన్ వివరించింది. ప్రధానంగా ఆమె ఆరోగ్య సమస్యలు పూర్తిగా మాయమయ్యాయని చెప్పింది. తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఆహారపు అలవాట్ల మార్పుతో చర్మ సౌందర్యం, ఆరోగ్యం మెరుగుపడుతుందన్న నిజాన్ని జాక్వెలిన్ నిరూపించింది.**

**– అక్షరటుడే, సినిమా డెస్క్**